భార్య దృష్టిలో తనే అసలైన మగాడినని నిరూపించుకోడానికి అతను వేసిన పథకం ఫలించిందా?

కె.వి.వి. సత్యనారాయణ రాజు కథ

# పరిహద్దు

అందం అనేది అందరికీ అన్ని అవయవాల్లోనూ ఉండదు. కొందరికి కళ్ళలో, మరికొందరికి చూపులో, ఇంకా పెదవి విరుపులో, చెక్కిళ్ళ వంపులో, మాట తీరులో, నడిచే విధానంలో— ఇలా ఏ అవయవంలో ఏ రకంగానైనా ఉండొచ్చు.

కైపుగా చూసే కళ్ళంటే ఎంతో ఇష్టం సుధాకర్‌కి. మాట్లాడేటప్పుడు అదోరకంగా పెదవి విరిచే ఆడాళ్ళంటే మరీ పిచ్చి అతడికి. మొదటిసారి లీలావతిని చూసినపుడు ఆమెలో ఈ రెండు లక్షణాలతోపాటు జఘన సౌందర్యాన్ని, ఇంకా సగటు మగవాడు మెచ్చే ఇతర భాగాల్నీ చూసి అమితంగా ఆకర్షింపబడ్డాడతడు.

అల్లారు ముద్దుగా పెంచుకొన్న కొడుక్కి ఏం కావాలన్నా ఆలోచించకుండా తెచ్చిస్తూ— 'ఆహా అమ్మా నాన్నాలంటే వీళ్ళేకదా?'' అని అతడి కోరిక తీరిన ప్రతిసారీ అతడనుకునేలా ప్రవర్తిస్తూ వచ్చారతడి తల్లిదండ్రులిన్నాళ్ళూ. కనుక ఇప్పుడు కూడా అతడు ఇష్టపడడమే ఆలస్యమన్నట్టుగా సంబంధం ఖాయం చేసుకొని బ్రహ్మచారిని కాస్త పెళ్లికొడుగ్గా మార్చేసారు.

సుధాకర్ చాల విషయాల్లో అందర్లాంటి మగాడే అయినా శృంగారం విషయంలో అతడి అభిప్రాయాలు వేరు. ఆ విషయంలో అతడి అభిప్రాయాలు భిన్నంగా ఉండడానికీ, ఆడవాళ్లను గురించి అతడికున్న అవగాహనకూ సంబంధముంది.

ఆడదంటే అన్ ట్రయిన్డ్ చిలకలాంటిదని అతడికి బాగా నమ్మకం.



ఓపిగ్గా ట్రైనింగ్ ఇస్తే చిలక ఎంత బాగా [illegible] ప్రగాఢ విశ్వాసం
పలుకుతుందో, ఆడదానికి శృంగారంలోని చిలకకు మాటలు నేర్పాలంటే మెళకువలు జాగ్రత్తగా నేర్పితే అంతకు చిన్నప్పటి నుంచీ ఆ ప్రయత్నం చేయాలి. పదిరెట్లు స్వర్గసుఖాల్ని చవిచూడవచ్చునని [illegible] శృంగారం గురించి వివ

రించాలంటే అంతకుముందు ఆమె 'శృంగారం' అనే పదంకూడా విని ఉండకూడదు. అప్పుడే తన ప్రయత్నం సిద్ధించి తన కలలు పండుతాయి. ఇదీ అతడి ధోరణి.

కానీ శృంగారం అనే పదం వినకుండానే ఆడది పెరిగి పెద్దది కావడం ప్రస్తుత కాలమాన పరిస్థితుల దృష్ట్యా అసంభవం.

అయితే తనకు కావలసిన అమ్మాయిని చేసుకొని వచ్చిన విధంగా మలచుకునేదెలా? తీవ్రంగా ఆలోచించినమీదట అతడో నిర్ణయానికొచ్చాడు.

దాని ప్రకారం— శృంగారం విషయంలో శుద్ధ పప్పులు పల్లెటూళ్లలో దొరుకుతాయి. పట్నంలో పుట్టి పెరిగిన అమ్మాయిలు పెళ్ళయ్యేనాటికి మగవాళ్ళకే ఎదురునేర్పే పరిస్థితిలో ఉంటారు.

తన నిర్ణయాన్ని తక్షణమే అమలుజరిపే ప్రక్రియలో భాగంగా, భుజాన్నో ఎయిర్ బాగ్ తగిలించుకొని పల్లెటూరి చిలకలకోసం వేట ప్రారంభించాడు.

అలా దాదాపు రెండు సంవత్సరాలు తిరిగాక ఒక ఇంటిముందు పద్దెనిమిదేళ్ళ అమ్మాయిని పరీక్షగా చూసాడు. అతడి గుండె కొట్టుకోవడం అతడికే వినిపించింది స్పష్టంగా. అతడికెందుకో అనిపించింది— ఈ ముగ్ధ కోసమే తను వెదుకుతున్నాడేమోనని!

అలా అనుకొన్న తర్వాత ఏ మాత్రమూ ఆలస్యం చేయకుండా తల్లిదండ్రులతో సహా ఆ ఊరెళ్లి ఆ సంబంధం ఖాయం చేయించుకొని ఆ చిలకల కొలికిని ఇంటికి తెచ్చుకున్నాడు.

శోభనం రోజు— "చిలకా?" అని పిలిచిన భర్తతో అమాయకంగా "ఇక్కడ చిలకలేమీ లేవండీ!" అంటూ అటూ ఇటూ చూసిన భార్యను గట్టిగా ముద్దు పెట్టుకుంటూ మనసులో అనుకున్నాడు సుధాకర్— 'అందుకే నువ్వంటే నా కిష్టం' అని.

'చిలకా!' అని పిలిచి మాటా పలుకూ లేకుండా తనను వాటేసుకున్న భర్తవైపు అయోమయంగా చూసింది లీలావతి. ఆమెలోని అమాయకత్వం మరీ ప్రస్ఫుటంగా ఆమె భావాల్లో కనబడడంతో ఎడతెరిపి లేకుండా ముద్దులు గుప్పించాడు సుధాకర్.

తడితడిగా ఉన్న బుగ్గలను తడుముకొంటూ మధ్య మధ్యలో "ఛీ... యాక్... ఎంగిలి" అని అతి సహజంగా అన్న ఆమె మాటలకు మరీ రెచ్చిపోయాడు సుధాకర్. 'తన భార్య ముద్దంటే ఏవిటో కూడా తెలియని ముగ్ధ!' అనుకుంటూ.

"దీన్నే ముద్దు పెట్టుకోవడమంటారు, తెలుసా?" అన్న భర్త మాటలకు మొహం అదోలా పెట్టి— "ఛీ... ఇదేవిటి? ఒకరి ఎంగిలి మరొకరికి తగలడం... నా కొద్దు బాబూ" అంటూ గునిసింది లీలావతి.

"అరే! ఈ మాత్రానికే నా కొద్దు బాబూ అంటే ఎలా? ఇంకా చాలా మేజిక్‌లున్నాయి" అంటూ అవేమిటో చెవిలో చెప్పాడు.

"ఛీ..." అంటూ కనురెప్పలు లేపలేక అతడికి దూరంగా పారిపోయింది లీలావతి.

మూణ్ణాళ్ళ ముచ్చట ముగిశాక ఏ మాత్రమూ ఆలస్యం చేయకుండా లీలావతీ సమేతుడై తన స్వంత ఊరికి దూరంగా ఉన్న ఒకానొక పట్టణంలో కాపురం పెట్టాడు సుధాకర్.

ఆడవాళ్ళు కోరుకునే విధంగా దేహాన్ని మలచుకోవడం కోసం పెళ్ళికాక ముందు రోజూ వ్యాయామం చేసేవాడు సుధాకర్.

కానీ పెళ్ళయ్యాక ప్రత్యేకంగా వ్యాయామం చేయాల్సిన అవసరం అతడికి కనబడ లేదంటే దానికి కారణం— శృంగారంలోని మెళకువల్ని అతి జాగ్రత్తగా పరిశీలించి అనుభవం మీద వ్రాసిన ఎంతోమంది రసిక శిఖామణుల ఉద్గ్రంథాల్లోని పద్ధతులన్నీ ప్రాక్టికల్‌గా అతడు చేయడానికి ప్రయత్నించడమే.


ప్రతిదానికీ ఓ అంతం అంటూ ఉంటు ఉంటుంది కదా! తను చదివి నేర్చుకున్న విషయాలన్నీ ఆచరణలో పెట్టాక, ఇంకా ఏంచేసి భార్య మన్ననలను పొందాలోనన్న విషయం గుర్తొచ్చినప్పుడల్లా ఎంతో బాధగా ఉండేదతడికి.

అందుకే ఈ మధ్యనో కొత్త పద్ధతి ప్రారంభించాడు. తన సామర్థ్యాన్ని మిగిలిన మగవాళ్ళతో పోల్చిచూడడమే అతడాలోచించిన కొత్త పద్ధతి.

బుర్రలోకి ఆలోచన వచ్చిన తక్షణమే అమలు జరపడం అతడికనాదిగా వస్తున్న అలవాటు. వాయిదా— అనే పదం అంటే ఎంతో అయిష్టం అతడికి. అందుకే ఆ రోజు రాత్రి పడగ్గదిలో భార్యతో అన్నాడు. "నిన్న ఆఫీసులో మా కొలీగ్ రఘు చెప్పిన విషయం వింటే ఎవరికైనా జాలి కలుగుతుంది...."

ఆశ్చర్యంగా చూసింది లీలావతి. ఆమె ఆశ్చర్యపడ్డది అతడన్న విషయంలోని భావానికి కాదు.

పడగ్గదిలో తమిద్దరి గురించి తప్ప ఇంకా వివరంగా చెప్పాలంటే ఆ సమయంలో శృంగారం గురించి తప్ప మరే విషయం



మాట్లాడినా సుధాకర్ కిష్టముండదు. ఒకసారి పక్కమీదకు చేరాక ఏదో జనరల్ టాపిక్ మాట్లాడబోతే ఆమెను వారించి 'ఏ సమయంలో ఎటువంటి విషయాలు మాట్లాడాలనే విషయంమీద ఆ రాత్రంతా ఉపన్యాసం ఇచ్చి ఆమెచేత 'అవును మీరు చెప్పింది నిజమే?''నపింపజేసి గానీ తృప్తిపడలేదు సుధాకర్.

అటువంటిది ఆ రాత్రి ఎవరో థర్డ్ పెర్సన్ గురించి భర్త చెప్పబోవడం ఆమెకు చాలా ఆశ్చర్యం కలిగించింది. భర్త ఏం చెప్పబోతున్నాడో తెలియక ఆమె ఆలోచనలో పడింది. తన ఊహల్ని ఆచరణలో పెట్టే హడావుడిలో ఉన్న సుధాకర్ ఆమె భావాలను పట్టించుకోలేదు.

''పాపం రఘు, పెళ్ళయి మూణ్ణెల్లన్నా కాలేదు, అప్పుడే జీవితంలో అసంతృప్తి అతడికి. నిన్న నా దగ్గర అంతా చెప్పుకొని బావురుమన్నాడు. మొదటి రాత్రి అతడి పెళ్ళాం, ''ఛీ నువ్వేం మగాడివి?'' అందిట. ఆ మర్నాడే నాలాంటి వాణ్ణెవ ణ్ణయినా కలుసుకొని 'ఆ రకంగా' పెళ్ళాం నోరు ఎలా మూయించాలో తెలుసుకొని ఉండకూడదు? ఎవరితోనూ చెప్పడానికి మనసురాక, పెళ్ళాం డామినేషన్ భరించలేక ఈ మూణ్నెల్లలోనూ వయసు మళ్ళిన వాడిలా తయారయ్యాడు...''

భర్త మాటలు వింటూ అతడి నడుంమీద చేయి వేసి అడిగింది లీలావతి— ''ఏం రఘు మగాడు కాదా?''

ఆమెకలా ఓపెన్‌గా మాట్లాడడం సుధాకరే నేర్పాడు.

తను ఎదురు చూసిన ప్రశ్నే వేసిన భార్య వైపు మెచ్చుకోలుగా చూస్తూ అన్నాడు సుధాకర్— ''మగతనం ఉన్న వాణ్నే మగాడనేటట్టయితే... ఇప్పుడు నాకూ అనుమానం వస్తోంది. అతడు మగాడు కాదేమోనని...''

''ఛీ... పోదురూ మీది మరీ చోద్యం! 'మగతనం' లేకపోవడమేమిటి?''

''ఓహో.... మగతనం అంటే మరీ 'ఆ' అర్థం తీసుకున్నట్టున్నావు. నేనన్నది ఆ మగతనం గురించి కాదు. ఉన్న మగతనాన్ని నిజమైన మగాడిలా వాడుకోగలిగే మగతనం''

''అటువంటి వాళ్ళు కూడా ఉంటారా?....'' గోముగా అమాయకంగా అడిగింది లీలావతి.

''ఓ, మైగాడ్! అంతా నాలాగే పెళ్ళాన్ని సుఖపెట్టగలరను కొంటున్నావా? నేనంటే శృంగారం యొక్క ప్రాముఖ్యాన్ని గుర్తించవ లసిన సమయంలో గుర్తించి, శృంగారాన్ని ఆవుపోసన పట్టాను కనుక— నీకు మగతనం లేని మగవాడు ఎలా ప్రవర్తిస్తాడనేది ఊహామాత్రంగానైనా తెలిసే అవకాశం ఇంతవరకూ రాలేదు. అఫ్‌కోర్స్! రావాలని నేను కోరుకోవడంలేదు కూడా!!'' అంటూ ఆమెకు దగ్గరగా జరిగాడు సుధాకర్.

ఆ రోజుకతడి పాచిక పారింది. మొదటిసారిగా తనను మరో మగాడితో పోల్చి తన భార్య ఆరకంగా ఎంత అదృష్టవ ంతురాలో తెలియజెప్పి ఆమె మనసులో మగతనమున్న మగాడిగా ముద్ర వేయించుకున్నాడు.

ఆ రోజు మొదలు ప్రతిరాత్రీ ఎవరో ఒకరితో తనను పోల్చుకుని తనను భర్తగా పొందడంవలన ఏ స్త్రీకూడా అనుభవించని సౌఖ్యాల్ని ఆమె ఎలా స్వంతం చేసుకోగలుగుతోందో సోదాహరణ సహితంగా వివరించేవాడు సుధాకర్.

అతడు చెప్పినవన్నీ విని మనసులో భద్రంగా రికార్డు చేసుకోవడానికికామె ప్రాణంలేని కంప్యూటర్ కాదు కదా? మొదట్లో యదాతథంగా రిసీవ్ చేసుకున్న లీలావతే, కొంత కాలం గడిచాక తన భర్త ఇవన్నీ కల్పించి చెబుతన్నాడేమోననే ఆలోచనలో పడింది.

ఆ ఆలోచన రావడమే తడవుగా రఘు భార్య రమను కలిసింది లీలావతి. అప్పుడామెకు కొన్ని అద్భుతమైన విషయాలు తెలిసాయి.

అందులో మొదటిది— లీలావతి రమను అడగాలనుకొన్న ప్రశ్ననే రమ లీలావతిని అడగాలను కోవడం.

ఆలోచించాక ఇద్దరికీ విషయం అర్థమైంది.

రఘుని చేతకాని వాడిగా సుధాకర్ తన భార్య దగ్గర ఎలా అభివర్ణించి తన సామర్థ్యాన్ని నిరూపించుకో జూస్తున్నాడో, అదే విధంగా సుధాకర్ని మగతనం లేనివాడిగా రమముందు చిత్రించి గర్వంగా మీసాలు మెలేస్తున్నాడు రఘు.

ఈ విషయం పూర్తిగా అవగతమయ్యాక ఆడవాళ్ళిద్దరికీ మొదటిసారిగా తమ భర్తల సామర్థ్యం మీద అపనమ్మకం ఏర్పడింది.

ఆరోజు నుంచీ తమ భర్తలను జాగ్రత్తగా గమనించడం ప్రారంభించారు. ఒక ప్రత్యేకమైన దృష్టితో వాళ్లలా పరిశీలించడం ప్రారంభించారు కనుక అతి కొద్ది సమయంలోనే ఇద్దరికీ తమ భర్తల ప్రవర్తన పట్ల వైముఖ్యం, అయిష్టత జనించి ఆ అయిష్టత అసహ్యంగా మారింది.

ఒక వస్తువును అసహ్యించుకోవడం ప్రారంభించాక, ఆ అసహ్యాన్ని దూరంకావడం కోసం తమ కిష్టమైన వస్తువు గురించి అన్వేషణ మొదలవుతుంది.

తమ తెలివి తేటలతో తమ భార్యలను కంట్రోల్‌లో ఉంచామనే భ్రమలో రోజుకో కథ చెప్పి తమ భార్యల నాకట్టుకొనే ప్రయత్నం మాత్రం మానలేదా మగవాళ్ళిద్దరూ.

పరిహద్దు రేఖమీద నిలబడిన అతివలిద్దరూ, ఆ రేఖను దాటే అవకాశంకోసం ఎదురుచూస్తున్నారు.

ఆ అతివల మనసుల్లో ఏముందో లీలామాత్రంగానైనా తెలిస్తే తాము ఇంట్లో లేనపుడు భార్యల బ్రెయిన్ వాష్ చెయ్యడానికి పూర్వం రాజులు తమ భార్యలకు నీతులు బోధించే చిలకల అంతఃపురంలో పెట్టే వాటితో రోజుకో కథ చెప్పించినట్టుగా— మాటలు నేర్చిన చిలకను చెరోదాన్నీ తెచ్చి ఇంట్లో ఉంచేవారేమో పాపం ఆ మగవాళ్ళిద్దరూ!